క్లుప్తంగా

దెబ్బతిన్న పాలిష్ పరిశ్రమల పరిశీలన



దెబ్బతిన్న పాలిష్ పరిశ్రమను పరిశీలిస్తున్న ఆర్ఐ, వీఆర్వో

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో 5 పాలిష్ పరిశ్రమల పైకప్పులు గురువారం సాయంత్రం వీచిన భారీ ఈదురుగాలులకు కూలిపోయాయి. రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని పరిశ్రమల యజమానులు ఎలగటూరి వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, సునీత, సుహాసిని, లక్ష్మీదేవి వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని అధికారులకు విన్నవించారు. దీంతో శుక్రవారం ఆర్ఐ హేమంత్ రెడ్డి, వీఆర్వో జయలక్ష్మి పరిశ్రమలను పరిశీలించారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం



సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న హెచ్ఎం

కోవెలకుంట్ల: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల హెచ్ఎం గీతా అన్నారు. వేసవి సెలవుల దృష్ట్యా వివిధ క్రీడలకు సంబంధించి పాఠశాలలో 30 రోజుల సమ్మర్ క్యాంపు నిర్వహణకు నంద్యాల స్పోర్ట్స్ అథారిటీ ఎంపిక చేయగా శుక్రవారం శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని ఆయా క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. సెల్‌ఫోన్లు వినియోగించడం, తల్లిదండ్రులకు తెలియకుండా ఈతకు వెళ్లడం, బైక్‌లపై తిరగడం వంటి పనులు చేయకుండా క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. ఫిజికల్ డైరెక్టర్లు హర్ష, ఓబులేసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన కారు

కొలిమిగుండ్ల: స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలోని ఇటిక్యాల రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఇటిక్యాలకు చెందిన ఏసురత్నం పని నిమిత్తం కారులో కొలిమిగుండ్లకు వచ్చి తిరుగు పయనమయ్యాడు. అదే సమయంలో తాడిపత్రి నుంచి వస్తున్న లారీ కస్తూర్బా సమీపంలోని మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొనడంతో ఏసురత్నం తీవ్రంగా గాయపడ్డాడు. నారాయణస్వామి అనే వ్యక్తి స్వల్పగాయాలతో బయట పడ్డాడు. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం అనంతపురం తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

విగ్రహ ప్రతిష్టలో కాటసాని



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె: యాగంటిపల్లెలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం జరిగిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అలాగే స్థానిక సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పెద్దకొట్టాల గ్రామానికి చెందిన రామ్మోహన్‌రెడ్డి కుమారుడు పురుషోత్తంరెడ్డి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కాటసాని తిరపాల్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి ఉన్నారు.

గడ్డివామి దగ్ధం

డోన్ రూరల్: జగదుర్తి గ్రామానికి చెందిన సుంకన్న గడ్డివామి శుక్రవారం దగ్ధమైంది. పశువుల కోసం ఇంటి సమీపంలో వాము వేసుకున్నాడు. హఠాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేసినట్లు ఫైర్ ఎస్ఐ రంగస్వామిగౌడ్ తెలిపారు. అప్పటికే గడ్డి వామి కాలిపోయింది. రూ.70వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

వేలంలో ఆలయానికి ఆదాయం

బనగానపల్లె: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయానికి చెందిన భూములు కౌలు హక్కుల కోసం శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. వేలంలో రూ.1.08 లక్షలు ఆదాయం వచ్చినట్లు పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. కొన్ని సర్వేనంబర్లకు వేలం పాట వాయిదా పడినట్లు పేర్కొన్నారు. అలాగే తలనీలాలు, చెప్పుల స్టాండ్ నిర్వహణకు ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో ఈ నెల 7వ తేదీకి వాయిదా వేసినట్లు వెల్లడించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ పాల్గొన్నారు.

మూడుముక్కలాట

- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై సందిగ్ధత
- రెండు కొత్త భవనాలు, ఒక పాత భవనం
- ఎక్కడ నిర్వాహించాలనేదానిపై భిన్నాభిప్రాయాలు
- రాజకీయ ఒత్తిళ్లు, స్వార్థ ప్రయోజనాలతో అయోమయ పరిస్థితి



పట్టణ శివారులో గతంలో నిర్మించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, షాపింగ్ కాంప్లెక్స్.



శిథిలావస్థకు చేరిన ప్రస్తుత కార్యాలయం

డోన్: డోన్ సబ్‌రిజిస్ట్రార్ అధికారులు, ఉద్యోగుల పరిస్థితి మూడుముక్కలాటగా తయారైంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకుడైన మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ మురళీకృష్ణగౌడ్ తన వెంచర్‌ను అభివృద్ధి చేసుకునేందుకు పట్టణ శివారులోని ఎంకే టౌన్‌షిప్‌లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం భవన నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. రూ.1.68 కోట్ల ఏపీఎంఎస్ఐడీసీ నిధులతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనాన్ని 2019 ఫిబ్రబరిలో నిర్మించారు.

ఇచ్చింది జానెడు.. సొంత లాభం బారెడు

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి ఐదు సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చిన మురళీకృష్ణ గౌడ్ కుటుంబీకులు ఆ భవనం చుట్టూ తమ సొంత స్థలంలో 20 షాపులతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. రూ.50 వేల అడ్వాన్స్, రూ.5వేల బాడుగ నిర్ణయించడంతో డాక్యుమెంట్ రైటర్లు ఎవరూ ముందుకు రాలేదు. ఈలోపు ప్రభుత్వం మారడం, శివారు ప్రాంతంలో నిర్మించిన భవనం వల్ల భద్రత ఉండదని ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ నడిబొడ్డున రెవెన్యూ క్వార్టర్స్‌లో 2024 మార్చిలో రూ.99.54 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవనం ప్రారంభించినా కాంట్రాక్టర్ బిల్లులు రాలేదనే నెపంతో అధికారులకు అప్పగించకపోవడంతో



పట్టణ నడిబొడ్డున రెవెన్యూ క్వార్టర్స్‌లో నిర్మించిన కార్యాలయం

ఉద్యోగుల పరిస్థితి సందిగ్ధంగా మారింది.

ఒత్తిళ్లతో సంకటస్థితి

ప్రస్తుతం ఉన్న భవనం 1914లో బ్రిటీష్ కాలంలో నిర్మించారు. శిథిలావస్థకు చేరడంతో వర్షం వస్తే రికార్డులన్నీ నీటితో తడిసి ముద్దవుతాయని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు టీడీపీ నాయకుడైన మురళీకృష్ణగౌడ్ తన వెంచర్ సమీపంలో ఉన్న భవనంలోకి కార్యాలయాన్ని మార్చాలని పట్టుపడుతున్నాడు. మరోవైపు ఈ భవనం కన్నా రెవెన్యూ క్వార్టర్స్‌లో నిర్మించిన భవనం అందరికీ అనువుగా ఉంటుందని అదే పార్టీకి చెందిన ఎమ్మెల్యే వర్గీయులు ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం అన్న చందంగా ఉన్నతాధికారులు ఈ విషయంలో ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో ఉన్నారు. మరోవైపు వర్షాకాలం రానుండడంతో ఇప్పుడున్న పురాతన భవనంలో తాము విధులు నిర్వహించలేమని ఉద్యోగులు ఉన్నతాధికారుల ముందు తెగేసి చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లా సబ్‌రిజిస్ట్రార్ జానకిదేవి రెండు కొత్త భవనాలను ఇటీవల పరిశీలించి వెళ్లినా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఉద్యోగులతో పాటు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ క్వార్టర్స్‌లో కట్టిన భవనం అన్నివిధాలా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి అనువుగా ఉంటుందని చాలా మంది భావిస్తున్నారు. అధికారులు త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటాం



ఏ భవనంలోకి కార్యాలయాన్ని బదిలీ చేయాలనే విషయాన్ని ఉన్నతాధికారులు నిర్ణయిస్తారు. బ్రిటీష్ హయాంలో నిర్మించిన ప్రస్తుత భవనం శిథిలావస్థకు చేరుకుని వర్షాకాలంలో ఉరుస్తోంది. దీంతో రికార్డులు తడిసిపోతున్నాయి. కార్యాలయాన్ని ఏ భవనంలోకి మార్చాలన్నదానిపై ఉన్నతాధికారుల నిర్ణయమే శిరోధార్యం.

–మహబూబ్ బాషా, సబ్‌రిజిస్ట్రార్, డోన్

భద్రత ఉండదు



రియల్ ఎస్టేట్ వ్యాపార వృద్ధి.. షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా ఆదాయం వస్తుందనే స్వార్థ ప్రయోజనాలతో మారుమూల ప్రాంతంలో గతంలో కార్యాలయాన్ని నిర్మించారు. నిత్యం నగదు లావాదేవీలతో ముడిపడి ఉన్న కార్యాలయం శివారు ప్రాంతంలో ఉంటే భద్రత ఉండదు. ప్రస్తుతం పట్టణ నడిబొడ్డున ఉన్న భవనంలోకి కార్యాలయాన్ని మారిస్తే సమంజసంగా ఉంటుంది.

–నరసింహారెడ్డి, రైతు, యాపదిన్నె గ్రామం

డాక్యుమెంట్ రైటర్లపై ఆర్థిక భారం



గతంలో నిర్మించిన భవనం చుట్టూ ప్రైవేటు వ్యక్తుల షాపింగ్ కాంప్లెక్స్ ఉండడం వల్ల డాక్యుమెంట్ రైటర్లపై అద్దె భారం విపరీతంగా పడుతుంది. మూలిగే నక్కపై తాటికాయపడ్డట్టు ప్రస్తుత రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గడంతో అద్దెల భారాన్ని మోసే పరిస్థితి లేదు. రెవెన్యూ క్వార్టర్స్‌లో నిర్మించిన భవనంలోకి రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని మార్చాలి.

–ఖాజాబీ, మహిళా డాక్యుమెంట్ రైటర్

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ గౌతమి

కోవెలకుంట్ల: ఇటీవల కాలంలో చోటు చేసుకుంటున్న ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నంద్యాల మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ గౌతమి, కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో మహిళలు, కాలనీ ప్రజలకు సైబర్ నేరాలు, 100, 112, శక్తియాప్, బాల్య వివాహాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు వీడియోకాల్స్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దన్నారు. సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరాలకు పాల్పడుతూ మోసం చేస్తున్నారన్నారు. వ్యక్తిగత బ్యాంకు ఖాతా, ఓటీపీ, తదితర వివరాలు తెలపకుండా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. మహిళల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలను అమలు చేస్తున్నాయన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు



ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



చిన్ని క్రిష్ణయ్య (ఫైల్)

అవుకు: ఆత్మహత్యకు యత్నించిన ఏఆర్ కానిస్టేబుల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం రాత్రి మృతిచెందారు. కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల మేరకు.. అవుకు పట్టణానికి చెందిన సుంకేసుల చిన్న క్రిష్ణయ్య(35) నంద్యాలలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుండేవాడు. ఉద్యోగ రీత్యా నంద్యాల టౌన్‌లోని బాలజీ కాంప్లెక్స్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు. కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో విసిగిపోయాడు. దీంతో ఏప్రిల్ 2వ తేదీ నంద్యాలలోని చిన్న చెరువు సమీపంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. అక్కడి నుంచి శాంతిరాం ఆస్పత్రికి అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం రాత్రి మృతి చెందారు. మృతదేహాన్ని శుక్రవారం స్వగ్రామమైన అవుకుకు తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. నంద్యాల జిల్లా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్ యాదవ్, ఆర్ఎస్ఐ దాదాపీరా, స్థానిక ఎస్ఐ రాజారెడ్డి పోలీసు శాఖ తరుపున రూ.2లక్షలను కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాలతో ఏఆర్ కానిస్టేబుల్ అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతునికి భార్య విజయలక్ష్మి, కుమారుడు కీర్తదేవ్, ఒక కుమార్తె ఉన్నారు.

కిశోర బాలికలకు ప్రత్యేక శిక్షణ



నందవరంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

ప్యాపిలి: వేసవి సెలవుల్లో కిశోరి బాలికలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దేవక్కపమ్మ తెలిపారు. స్థానిక బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి బాలికలు, తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జూన్ 12వ తేదీ వరకు అంగన్‌వాడీల పరిధిలోని కిశోరి బాలికలకు పలు విషయాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని కిశోరి బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ఫర్జానా, సరస్వతి పాల్గొన్నారు.

- **బనగానపల్లె రూరల్:** మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం జరిగింది. స్థానిక పొదుపు భవనంలో సూపర్‌వైజర్లు చిట్టెమ్మ, లక్ష్మీశైలజ, తెలుగుపేట శ్రీరాముల ఆలయంలో సూపర్‌వైజర్ సాలమ్మ, నందవరంలో జమిలా బాల్య వివాహాలు, పోక్సో చట్టం, బాలికల ఆత్మరక్షణ, యోగా తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ప్యాపిలి: పట్టణ సమీపంలోని పెద్దమ్మ కొండపై పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. పోలీసులను చూసిన పేకాట రాయుళ్లలో ఆరుగురు పరారయ్యారు. అక్కడే ఉన్న ఒకరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పేకాట స్థావరంలో రూ. 4100 నగదు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు.

ఏఐవైఎఫ్ మహాసభలను జయప్రదం చేద్దాం



పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

బేతంచెర్ల: తిరుపతిలో మే 15 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాముడు, సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, నాయకులు రవి, క్రిష్ణ, మధు, ప్రదీప్, సాయి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం శ్రేయస్కరం

డోన్ రూరల్: ప్రకృతి వ్యవసాయం అన్ని విధాలా శ్రేయస్కరమని.. రైతులు ఆ పద్ధతులు పాటించి భూసారాన్ని పెంచుకుని అధిక దిగుబడులు సాధించాలని ప్రకృతి వ్యవసాయశాఖ ఇన్‌చార్జి లోకేష్ సూచించారు. మండల పరిధిలోని కామగానిగుంట్ల గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు.

రసాయనాలతో పండించే పంటలతో ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. సిబ్బంది ప్రసాద్, గోవింద్‌రెడ్డి, కృపావతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

వీడని వాన.. అన్నదాతల ఆందోళన



భీమునిపాడు సమీపంలో నేలవాలిన వరి

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో మూడు రోజుల నుంచి అకాల వర్షాలు అన్నదాతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వరి, మొక్కజొన్న, పొగాకు, మిరప రైతులు పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఉదయం నుంచి ఎండ తీవ్రతగా ఉండి సాయంత్రం వేళల్లో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షాలు పడుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి, మొక్కజొన్న, మిరప పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో దిగుబడులను కల్లాలు, పొలాల్లో ఆరబెట్టుకున్నారు. ఉదయం ఎండకు ఆరబోసుకోవడం, సాయంత్రం అయ్యేసరికి రాశులుగా పోసుకుని వర్షానికి తడవకుండా పట్టలు కప్పుకుని పంట ఉత్పత్తులను కాపాడుకుంటున్నారు. ఆయా పంటలకు గిట్టుబాటు ధర వచ్చే వరకు ఈ కష్టాలు తప్పేటట్లు లేవని రైతులు వాపోతున్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి



డోన్‌లో ఆదిశంకరాచార్యుల విగ్రహం ఊరేగింపు.



బేతంచెర్లలో..

డోన్ టౌన్: జగద్గురు శ్రీఆదిశంకరాచార్యుల జయంతిని శ్రీవేదమాత బ్రాహ్మణ సంఘం, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాయత్రి పీఠంలోని అమ్మవారికి, తత్తాత్రేయస్వామి, ఆది శంకరాచార్యులకు ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు గండ్లూరి దత్తాత్రేయశర్మ, అధ్యక్ష ఉపాధ్యక్షులు నంద్యాల శంకరశర్మ, శేషావలి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే విశ్వ హిందూ పరిషత్ సత్సంగ్ ప్రముఖ్ రామకృష్ణ, జిల్లా ధర్మచార్య ప్రముఖ్ రామారాజేష్ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ చేశారు.

- **బేతంచెర్ల:** పట్టణంలో గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతిని వైభవంగా నిర్వహించారు. గౌరి పేటలోని శివాలయంలో శివునికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సామూహిక పూజలు చేశారు. సాయంత్రం ఆదిశంకరాచార్యుల చిత్రపటాన్ని రథంపై వుంచి గ్రామోత్సవం నిర్వహించారు.

వైభవంగా తిరుచ్చి ఉత్సవం



మద్దిలేటి నరసింహస్వామికి తిరుచ్చి ఉత్సవం

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామివారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేసి నైవేద్య సమర్పణ, హారతులు ఇచ్చారు. సాయంత్రం స్వామివారిని పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.

ఉపాధ్యాయ ఉద్యమ నేతకు నివాళి



డోన్: దాచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్/డోన్ టౌన్: బనగానపల్లె, డోన్ యూటీఎఫ్ కార్యాలయాల్లో ఉపాధ్యాయ ఉద్యమ నేత దాచూరి రామిరెడ్డి వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. యూటీఎఫ్ జిల్లా సహఅధ్యక్షుడు సత్యప్రకాష్ మాట్లాడుతూ.. రామిరెడ్డి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. 1982లో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా ఎన్నికై ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. యూటీఎఫ్ నాయకులు కృష్ణయ్య, విజయకుమార్, నాగరాజు, మనోహర్, గోపాల్, యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బేతంచెర్ల: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో మొదటి విడత ప్రవేశాలకు ఈ నెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ఎలక్ట్రీషన్, ఎలక్ట్రానిక్, మెకానిక్, వెల్డర్, ఫిట్టర్ ట్రేడ్‌లలో సీట్లు ఉన్నట్లు చెప్పారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు. అనంతరం డోన్‌లోని ప్రభుత్వ ఐటీఐలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.



ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో క్రికెట్ ఆడుతున్న చిన్నారులు



కొత్తబుగ్గ కోనేటిలో ఈత కొడుతున్న చిన్నారులు



టీఆర్ నగర్‌లోని ఒక వీధిలో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

వేసవి సెలవులు ప్రారంభం కావడంతో విద్యార్థుల ఆటవిడుపు కోసం రకరకాల మార్గాలను ఎంచుకుంటున్నారు. కొందరు క్రికెట్, స్కేటింగ్, షటిల్ కోచింగ్‌లకు వెళ్తున్నారు. మరికొందరు మైదానాలు, రోడ్లు, వీధుల్లో క్రికెట్ ఆడుతూ గల్లీ బాయ్స్‌గా మారారు. వ్యవసాయ బావులు, నీటి కొలనుల్లో ఈత నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. డోన్ కొత్తబస్టాండ్, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్, వెంకటనాయునిపల్లె ఇంజినీరింగ్ కళాశాల మైదానాలతో పాటు ప్రతి వీధిలోనూ రకరకాల ఆటలు ఆడేందుకు చిన్నారులు మక్కువ చూపుతున్నారు. కొందరు తల్లిదండ్రులు చిన్నారులు బయటకు వెళ్లకుండా ఉండేందుకు క్యారమ్స్, చెస్, బారకట్ట లాంటివి ఆడిస్తున్నారు. పలువురు మైనర్లు ద్విచక్ర వాహనాలపై రోడ్లపై చక్కర్లు కొడుతూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు.

–డోన్